# ఆరిన దీపం! మారని లోకం!

రచన : శ్రీ ఆడారి వెంకటరమణ.

"అస్తమించిన సూర్యుడు ఉదయించాడు"
"ఉదయించిన సూర్యుడు అస్తమించాడు"

ఏ వాక్యం తరువాత ఏ వాక్యం రాయాలో తికమక పడుతున్నాడు శ్రీనివాసరావు. నిజానికి శ్రీనివాసరావు పేరు అతనికి తగదంటాను. ఏ మాత్రం 'శ్రీ' నివాసంలేని అతని తలిదండ్రులు ముందుగా ఊహించి తన తనయుడికి ఆ పేరు పెట్టుకొనయినా సంతృప్తి పడ్డానికి ఉబలాట పడ్డారేమో కాని అతని పరిచితులు మాత్రం 'శ్రీ'నివాసరావు అనే అర్థం వచ్చేలాంటి ఆ పేరును ఏమాత్రం గుర్తించ నప్పటికీ, కనీసం శ్రీనివాసరావనే దేవుడి పేరును ఉచ్ఛరించడానికికూడా మనస్కరించకపోవడం చేతనయితేనేం, నివాసరావుకు గౌరవప్రదమైన 'శ్రీ' అక్షరం చేర్చడానికి మన పొవ్వక 'రావూ' అని పిలవడానికి మాత్రం ఏకగ్రీవంగా ఓటువేసిన వారిలో నేనొకణ్ని. 'రావూ' అని పిలవడంలో వాడికి 'ఏంపీ రావూ' అని రాకూడదని మా మిత్రమండలి సర్వసభ్య సమావేశంలో తుదిగా, విధిగా నిర్ణయించిన ఓ నిర్ణయం మరి?

ఏమయినా శ్రీనివాసరావు మాత్రం కథలు, కవితలు బాగానే అల్లుతాడనేది అందరూ గతిలేక ఒప్పుకున్న ఓ నిజం (పైన వ్రాసిన శ్రీనివాసరావులోని అర్థం శ్రీ-నివాస మొదలయినవిలేవూ రావూ అని అర్థం చేసుకో ప్రార్థన.) ఒప్పుకోక చేసేదేముంది? పత్రికలూ-అభినందన లేఖలూ, మీ కథ మా పత్రికకు పంపండి అని రాసే సంపాదకుల లేఖలూ-అభిమానుల వెర్రభిమానం ఇన్ని సాక్షాధారాలుండగా ఒప్పుకోకపోతే తప్పు మాదే అవుతుందని ఒప్పుకున్నాం అని అందరితోనూ చెప్పుకొన్నాం అందరి మెప్పుకోసం.

ఇంత గొప్పవాడయిన రావు నామధేయుడు ఏ వాక్యం తరువాత ఏ వాక్యం రాయాలో ఆలోచిస్తున్నాడనేసరికి - అతడంటే మీలో కలిగిన దురభిప్రాయం మాసిపోవడానికి (అతడు మట్టిలో కలిసిపోయాడు కాబట్టే ఈ తాపత్రయం) ఓ ఉదాహరణ —

ఫ్రెంచి నవలా రచయితల్లో పెద్ద పేరున్న గుస్తావ్ ఫ్లోబేర్‌ను ఒకాయన అడిగాడట- "ఎన్నాళ్ళకో నవల రాస్తే బాగుంటుందని" దానికాయన సమాధానంగా "నాలుగురోజులకొక వాక్యం, నాలుగేళ్ళకొక నవల" అన్నాడట ఒక్కన. అడిగినాయన ముక్కూ, నోరూ మూసుకొని ఒకటే పలాయనం చిత్తగించాడు.

మరో దృష్టాంతం వినండి జేమ్స్ జాయిస్ ప్రఖ్యాత కథకుడు. ఆయన్ని చూడ్డానికి ఒకాయన వెళ్ళాడు అప్పుడు సాయంత్రము నాలుగు గంటలయింది "ఇప్పటిదాకా మీరేం చేస్తున్నారు?" అని అడిగాడు

"నా నవలొకటి రాసుకొంటున్నాను" అన్నాడట

"అయితే చాలా వుండాలన్నమాట"

"లేదు ఒకేఒక్క వాక్యం" అని జాయిస్ ఉదయం ప్రారంభించిన ఒక్క వాక్యాన్ని ఎన్ని విధాలుగా మార్చి రాశాడో, ఏవేవి ఎందువల్ల నచ్చలేదో ఆఖరి రూపంలో ఎందుకంగీకరించలేదో, వివరిస్తూ మాట్లాడాడట!

జాయిన్‌ని గురించే అనుకుంటాను ఇంకో కథ.
రోజంతా ప్రూఫొకటి చదువుకుంటూన్నాడతను.
సాయంత్రము ఈ దిగువ సంభాషణ —
"ఇవాళ ఏమిజేశారు?"
"ప్రూఫ్ రీడింగ్?"
"ఏమిటి ఫలితం"
"ఉదయం ఒక వాక్యంలో ఒక కామా తొలగించాను"
"మరిప్పుడు?"
"మళ్ళీ ఆ కామాని దాని స్థానములో వుండనిచ్చాను"

ఇదీ సంగతి. ఈ పాటికే అతనిమీది దుమారము ఎగిరిపోయిందనుకుంటాను ఇంతచక్కటి (నేననుకుంటున్నాను) ఉదాహరణ మహాకవి శ్రీనివాసరావుగా రందించినవే వారికి నా కృతజ్ఞతలు

"ఉదయించిన సూర్యుడు అస్తమించాడు" అనడములో అతనికి పూర్తిగా నచ్చినది కారణము అతని కమ్యూనిష్టు సిద్ధాంతాలే అంటారు కొందరు. ఉదయము ఆనందానికీ, విజ్ఞానానికి హేతువు అలాగే చీకటి దుఃఖానికీ అజ్ఞానానికి హేతువు.

"ఉదయించిన సూర్యుడు అస్తమించాడు!"

ఆనందమునుండి దుఃఖంలోనికా? అందుకే ఒప్పుకోడు ఈ రావు. విజ్ఞానమునుండి అజ్ఞానము లోనికా?

కార్మికలోకపు కళ్యాణానికి-శ్రామికలోకపు సౌభాగ్యానికి బాటలు వేసే పాటలు రాస్తూ పోతున్న ఈ కవి ఆ వాక్యాన్ని ముందు రాయడానికి మనసొప్పలేదు. కావున - మొదటి వాక్యమే మొదలయింది కథకు.

అసలు రావులో ఆ భావాలు ఎలా కలిగాయి? ఎందుకు కలగాలి? అని అతను బ్రతికున్నప్పటినుండే ప్రయత్ని స్తూనే వున్నాం కానీ-అర్ధముకావు. అర్ధము అయినట్టే వుంటాయి. ఏమిటో ఆ ఇంద్రజాలం.

ఆవేశముగా మాట్లాడతాడు. శూన్యంగా చూస్తూంది పోతాడు. అర్ధరాత్రి అదేపనిగా కదలిపోతూ వింటూ ఆకలి బాధ అని గొణుక్కుంటాడు.

"అసలు నువ్వెందుకయ్యా వ్రాస్తున్నా" వన్నాను.

"గాయకుని సంగీతం, చిత్రకారుని బొమ్మలూ, నటుని అభినయము, సాహిత్యపరుల రచనలూ ఎందుకంటే-? ప్రజలను తేజ పరచడానికే" అని కళ్లు మూసుకున్నాడు. అతని చంచలమైన విశ్వాసం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. అయినా అతనంటే నాకు దుగ్ధ ఎందుకు? అని ప్రశ్నించు కున్నాను. అతనంతవాణ్ని కాదు కాబట్టి!! సమాధానం నా హృదయములో నుండి ఏ మూలనుంటో వచ్చినప్పటికీ మనసుమాత్రం అంగీకరించలేదు. నేను మనిషిని కాబట్టి అందులోనూ ఆంధ్రుణ్నిగాబట్టి!!! ఆంధ్రులకు తిట్టడములో వున్న ప్రజ్ఞ మెచ్చుకోవడములో లేదట. వేలెడంతేసివాడు, జానెడంతేసివాణ్ణి చూసి మూరడంతేసివాళ్లున్నారు లేవోయ్ అంటాడుట.

"ఏమయ్యా కవీ! ఇంత పెద్ద వాడివీ! పైకి రాలేవే మయ్యా!" అన్నాను ఏడిపించాలన్న వుద్దేశ్యంతో.

సాహిత్యానికో కొలబద్దుందీ అన్నట్టు "పైకిపోయిన వారే పైకి వచ్చినట్టు లెక్క" అన్నాడు రెండు చేతుల్ని ఆ పైకి చూపిస్తూ, ఇంకాచెప్పడం మొదలుపెట్టాడు. "నువ్వు గొప్పవాడివి కాదలిస్తే చిన్న చిట్కా వుంది. అది అందరికీ అందుబాటులోనిదే కాని దానికి కాస్త ధైర్యం అవసరమను కుంటాను నీకుందే ధైర్యం పరిపోవచ్చు" అన్నాడు.

గొప్పవాణ్ని కావడానికి చిట్కా చెపుతాననేసరికి అందు లోనూ నాకా అవకాశం ఉందనేసరికి ఏ మూలనోవున్న ఆశ రెక్కలచప్పుడు చేసింది. "ఏమి చెయ్యాలి!" అన్నాను

"నువ్వు వెంటనే చచ్చిపో" అన్నాడు

తల తిరిగింది కోపం రేగింది

"ఆ పని నువ్వే చేయరాదూ!" అన్నాను సూటిగా.

అరగంట అదేపనిగా ఆలోచించాడు. అతని ఆలోచనా తీరుచూస్తే నాకు భయంవేసింది. ఒళ్లు అసూయతో జలదరిం చింది. కూర్చున్నవాడు పడుకున్నాడు. పడుకున్నట్టు లేదు. ఒరిగిపోయాడు అతని పెదాలు కదులుతున్నాయి అతని పెదాలకు నా చెవులు ఆనించాను. మాటలు వినిపిస్తున్నాయి. "బూర్జువాతత్వం నశించాలి" దాన్నే మూడుసార్లు రిపీట్ చేసి ఆగిపోయాడు. ఒళ్లు చల్లగా తయారయింది అప్పటికే గుండె హీనంగా కొట్టుకుంటోంది

మా మిత్రమండలి సభ్యులకు ఈ వార్తను నిమిషాలమీద అందించాను. కర్మకాండకు ఖర్చులు మేమే భరించాము అతడు బ్రతికున్నప్పుడు లేని అభిమానము మా సభ్యుల ప్రతి హృదయములోనూ గూడు కట్టుకున్నది. కన్నీళ్ళ రూపములో వెల్లుబికింది.

మా సమితి అధ్యక్షుడు గోపాలం మూడు రోజులు అన్నము సయించటములేదని తినడము మానేశాడు. ప్రతి పత్రికలోనూ శ్రీనివాసరావు ఫోటోలు పడ్డాయి. బ్రతికు న్నప్పుడు కవిగా గుర్తించని ఈ పత్రికలు చచ్చిపోయిన తరువాత మహాకవిని చేసిపారేశాయి. సంపాదకీయాలు వ్రాశాయి. పోస్టల్ స్టాంపులు విడుదలయ్యాయి. నగరము మధ్య కంచు విగ్రహము వెలిసింది.

అదీ ఒకందుకు మెరుగే అయ్యింది. శ్రీనివాసరావు తల్లికి పోటీగా ఏడుక్కోడానికి అక్కడికి మరే ముష్టివాళ్లు రాకుండా కట్టుదిట్టం చేశారు.